# మానవత్వం చాటుకున్న కలెక్టర్

నిజాంసాగర్, న్యూస్‌టుడే : ఆటోను ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొనడంతో గాయపడిన వ్యక్తిని చూసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మానవత్వంతో స్పందించారు. క్షతగాత్రుడిని తన అధికారిక వాహనంలో ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను పరిశీలించడానికి కలెక్టర్ బుధవారం వివిధ మండలాల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో నిజాంసాగర్ మండలం మాగి గేటు



సమీపంలో ఓ ద్విచక్రవాహనం.. ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో పెద్దకొడప్‌గల్ మండలం పోచారంతండాకు చెందిన సుందర్‌సింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో అటుగా వస్తున్న కలెక్టర్.. తన వాహనాన్ని ఆపి క్షతగాత్రుడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తన అధికారిక వాహనంలో బాధితుడిని చికిత్స కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ఆయనను ఆసుపత్రిలో చేర్పించిన తర్వాత వచ్చిన వాహనంలో కలెక్టరు మళ్లీ తన పర్యటన కొనసాగించారు.




# మనసు పెట్టి ఆడారు.. గెలుపు బాట పట్టారు

మహబూబ్‌నగర్ : మనసు పెట్టి సాధన చేస్తే ఎంత గట్టి పోటీ ఎదురైనా విజయం దోసోహం అవుతుంది. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో ఉమ్మడి పాలమూరు బాల, బాలికల జట్లు ఛాంపియన్లుగా నిలవడమే అందుకు నిదర్శనం. ఈ నెల 12 నుంచి 15 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 హ్యాండ్‌బాల్ టోర్నీలో పూర్వ పది జిల్లాల నుంచి 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తీవ్ర పోటీ నెలకొన్న పరిస్థితుల్లో.. గెలుపు కోసం మన జిల్లా క్రీడాకారులు తీవ్రంగా శ్రమించారు. ఏకాగ్రత, నిరంతర సాధన, మొక్కవోని ధైర్యమే వారిని రాష్ట్రస్థాయి ఛాంపియన్లుగా నిలబెట్టాయి.

ఏం చేశారంటే: టోర్నీకి ముందు 8 రోజుల పాటు హ్యాండ్‌బాల్, ఎస్‌జీఎఫ్ సంఘాల సమన్వయంతో ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు డీఎస్‌ఏ మైదానంలో, బాలికలకు మహబూబ్‌నగర్ హైస్కూల్‌లో శిక్షణ ఇచ్చారు. ఉదయం, సాయంత్రం సాధన కొనసాగింది. శిక్షకుల సలహాలు సూచనలు పాటిస్తూ కఠోరంగా శ్రమించారు. ప్రత్యర్థులను ఎలా చిత్తు చేయాలో మెలకువలు నేర్పించారు. క్రీడాకారులు వారం పాటు సొంత ఖర్చులతో జిల్లా కేంద్రంలో బంధువుల ఇళ్లలో ఉంటూ శిబిరంలో పాల్గొనడం విశేషం.

గతేడాది అండర్-17 హ్యాండ్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి గెలిపించా. అదే నమ్మకంతో అండర్-19 టోర్నీ బాధ్యతలు అప్పగించారు. ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌పై లీగ్ దశలో సమష్టిగా ఆడి గెలిచాం. సెమీస్‌లో కరీంనగర్, తుది పోరులో వరంగల్‌ను చిత్తు చేశాం.

లీగ్ దశలో నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జట్లపై గెలిచాం. సెమీస్‌లో కరీంనగర్‌ను ఓడించాం. ఫైనల్‌లో వరంగల్‌పై నెగ్గి టైటిల్ సాధించాం. జట్టును సమన్వయం చేస్తూ, సీనియర్లు, కోచ్, మేనేజర్లు సలహాలు ఇచ్చారు. ఇవి ఎంతో మేలు చేశాయి. ఆటగాళ్ల సహకారంతో జట్టును ముందుకు నడిపా.

# ఊడలమర్రి.. వయసు వందేళ్లపైనే..

ధన్వాడ : ఈ మర్రిచెట్టు ధన్వాడ మండలం మంత్రోనిపల్లి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలోనిది. వందేళ్లు దాటిన ఈ చెట్టు బుడం(మొదలు) గుర్తించలేం. ఎందుకుంటే ఊడలు రావడమే కాకుండా పలు కాండాలతో నిండి విశాలంగా విస్తరించింది.



ఊడలు మరింత విస్తరించకుండా ఉండేందుకు గ్రామస్థులు కింది భాగాన ట్రీగార్డులను ఏర్పాటు చేసి అందులోపల రాళ్లు పేర్చారు.

# ఆధిపత్యం కోసమే బెబ్బులి దాడులు

, కామారెడ్డి జిల్లాలో సంచరిస్తున్న పెద్దపులి తన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకొని ఇక్కడే స్థిరపడటానికి ప్రయత్నిస్తోందని జిల్లా అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కొత్త ప్రాంతంలో దాని ఉనికిని చాటుకునేందుకు పశువులపై వరుస దాడులు చేస్తోందని భావిస్తున్నారు. సాధారణంగా ఆకలి కోసం పశువుల్ని చంపితే మళ్లీ వెళ్లి తింటుంది. కాని అవసరం లేకున్నా.. పశువుల్ని చంపి ఆధిపత్యాన్ని నిరూపించుకుంటోందని అంటున్నారు. అందుకే 5 పశువులపై దాడి చేసి కేవలం రెండింటినే తిందని చెబుతున్నారు. చుట్టూ సరిహద్దులు నిర్ణయించుకుని అందులోనే స్థిరపడేలా కదలికలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో సంచరిస్తోంది 4 నుంచి 5 ఏళ్ల మగ పులి అని తెలుస్తోంది.



రెండో దానికి అవకాశం..

మంచిర్యాల నుంచి రెండు పులులు వచ్చాయి. ఒకటి గోదావరిఖనిలోని సింగరేణి ప్రాంతానికి, మరొకటి కామారెడ్డికి వచ్చింది. ఇది అడవిలో స్థిరపడితే మళ్లీ బయటకు రాకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. మరొకటి ఉన్నప్పుడే పులి సరిహద్దులు ఏర్పాటు చేసుకుంటుందని మరికొందరు అధికారులు చెబుతున్నారు. రెండోది కూడా ఉండే అవకాశముందని అంటున్నారు. ప్రస్తుతం రెండో పులి ఆనవాళ్లు కనిపించలేదని.. కాకుంటే ఈ పులే తీసుకొచ్చే అవకాశముందంటున్నారు.

మాచారెడ్డి ఆవాసంగా..!

పులి మాచారెడ్డి అడవుల్లో స్థిరపడినట్లేనని అధికారులు భావిస్తున్నారు. సామ్రాజ్యం ఏర్పాటు చేసుకోవడానికే చుట్టూ తిరుగుతోందని చెబుతున్నారు. మాచారెడ్డి అడవి చుట్టూ సుమారు 10 వేల ఎకరాలు దట్టంగా ఉందని, రాబోయే 2, 3 ఏళ్లలో ఈ ప్రాంతం పులులకు ఆవాసంగా మారే అవకాశముందని అంటున్నారు.

ఇదిగో అదిగో అంటూ..

జిల్లాలో సంచరిస్తున్న పులి ఇప్పటివరకు ఎవరి కంట పడలేదని అధికారులు చెబుతుండగా.. దోమకొండ మండలంలోని అంబారిపేట వద్ద కనిపించినట్లు కొందరు తప్పుడు వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. మరోవైపు మంగళవారం ఉదయం మాచారెడ్డి మండలంలోని ఇస్సాయిపేటలో కామటి చిన్నరాజంకు చెందిన గేదెను చంపేసింది. అడవిలోకి 100 మీటర్ల మేర లాక్కెళ్లింది. యజమాని బుధవారం మధ్యాహ్నం చూడటంతో అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. వారు కళేబరానికి పంచనామా నిర్వహించి అక్కడే కెమెరాలు ఏర్పాటు చేశారు. సమీపంలోని అన్నారం, అక్కాపూర్ గ్రామాల్లో చాటింపు చేయడంతో పాటు గ్రామస్థులకు పులి సంచారంపై అవగాహన కల్పిస్తున్నారు.

# గుడ్డు ధరలతో గడ్డు కాలమే..

నిజామాబాద్ జిల్లాలో కోడిగుడ్డు ధరలు రికార్డు స్థాయికి చేరాయి. సామాన్యులతో పాటు ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులపై ఈ ప్రభావం పడుతోంది. అసలే నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. దీనికి తోడు జిల్లాలోని గ్రామాల్లో గుడ్డు రిటైల్ ధర రూ.8కి పైగా పలుకుతోంది. కానీ, ప్రభుత్వం తక్కువ ధర




చెల్లించడంపై మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

92,500 మంది విద్యార్థులు.. : పేద విద్యార్థుల ఆకలి తీర్చడంతో పాటు పోషకాహారం అందించడం ద్వారా ప్రభుత్వ బడుల్లో డ్రాపౌట్స్ తగ్గించాలనే లక్ష్యంతో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నాయి. ఈ పథకం కింద పిల్లలకు వారానికి మూడుసార్లు ఉడికించిన కోడిగుడ్డు అందించాల్సి ఉంది. జిల్లాలో మొత్తం 1,156 పాఠశాలల్లో.. 92,500 మంది విద్యార్థులు ఉచిత భోజనాన్ని తింటున్నారు.

తేడా.. రూ.2 : ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.6 చొప్పున చెల్లిస్తోంది. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం దాని ధర రూ.8కి ఎగబాకింది. ఒక్కో విద్యార్థికి వారానికి రూ.6 చొప్పున అదనపు భారం మోయాల్సి వస్తోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర కోత.. వంటగ్యాస్ వాత : అంగన్‌వాడీ కేంద్రాల తరహాలో ఎండీఎం నిర్వాహకులకు ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలని ఆయా కార్మిక సంఘాలు కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. దీంతో ఈ ఏడాది గుడ్డు ధరను రూ.5 నుంచి రూ.6కి పెంచారు. అయినా బహిరంగ మార్కెట్‌లో అధిక ధర పలుకుతోంది. కేవలం కొనుగోలుకే రూ.2 చొప్పున నష్టపోతుంటే, ఉడకబెట్టడానికి గ్యాస్ ఖర్చు చేయాల్సి వస్తోంది.

అసలే.. బిల్లుల ఆలస్యం : అసలే వంట బిల్లులు ఆలస్యంగా వస్తున్నాయని, చాకిరీ చేయడంతో పాటు అప్పులు సైతం చేయాల్సి వస్తోందని పథకం నిర్వాహకులు వాపోతున్నారు. ఈ కారణంగానే గత రెండేళ్లలో చాలా మంది ఈ బాధ్యతల్లోంచి తప్పుకున్నారు. 'ప్రభుత్వమే ఎండీఎం పథకానికి గుడ్లు, సరకులు అందజేయాలి' అని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరి చక్రపాణి డిమాండ్ చేశారు.

# ఆయకట్టు నష్టాలు తీరేదెన్నడు

కొల్లాపూర్ న్యూటౌన్, లదశబ్దాల కిందట కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) కాల్వలు తవ్వినా చివరి ఆయకట్టు రైతులకు దాదాపుగా 5 వేల ఎకరాలదీ ఇదే పరిస్థితి. కొన్ని కాల్వలు అసంపూర్తిగా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి మండలంలో నాలుగు



నీరందడం లేదు. ఈ ఏడాది యాసంగి పంటలకైనా సాగునీరు దొరుకుతుందా..? అని రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కాల్వల నిండా కంపచెట్లు ఉండటంతో నీరు పారడం లేదు. ఇలాంటి పరిస్థితి నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో నెలకొంది.

20 వేల ఎకరాలకు అందని నీరు..: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ 33 కిలో మీటర్లు ఉండగా జిల్లాలోని కోడేరు మండలంతో పాటు వనపర్తి జిల్లాలోని పాన్‌గల్, ఏదుల మండలాల్లో ఇది పారుతుంది. మూడు మండలాల్లోని చివరి ఆయకట్టు పొలాలు జనుంపల్లి, తీగలపల్లి, బావాయిపల్లి, కోడేరు, డి-5 కాల్వ పూర్తి అధ్వానంగా మారింది. కంపచెట్లతో పూర్తిగా నిండింది. 15 వేల ఎకరాల పొలాలకు సాగునీరు అందడం లేదు. మహాసముద్రం, కొండ్రావుపల్లి, బాడుగదిన్నె చివరి ఆయకట్టు పొలాలకు నీరందడం లేదు. వనపర్తి జిల్లా ఏదుల మండలం తుర్కదిన్నె, రాజాపూర్, గుండేవాల్యానాయక్‌తండా గ్రామాల్లో గ్రామాల శివారున నీరు అందని పరిస్థితి నెలకొంది.

తూములు సరిగ్గా లేకపోవడంతో.. : పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వకు కొన్నిచోట్ల సరైన తూములు లేక కాల్వ గట్లు ఎక్కి నీరు పారుతోంది. తూములు ఉన్న ప్రాంతంలో షట్టర్ల నిర్మాణం జరగక సాగునీరు వృథాగా పోతోంది. కేవలం వరికే సాగు భూములు ఉపయోగపడుతున్నాయని, మెట్ట పంటలు వేరుశనగ, మినుములు, మొక్కజొన్న తదితర వాటిని వేసుకునే పరిస్థితి లేకపోతోందని రైతులు వాపోతున్నారు. ఒక పక్క చివరి ఆయకట్టు రైతులకు నీరు ఇబ్బందులు పడుతుంటే...తూములకు షట్టర్లు లేనిచోట నీరు ఎక్కువై పంటలు మునిగి రైతులు నష్టపోతున్నారు. కాల్వల నిర్వహణతో పాటు తూములకు షట్టర్లు ఏర్పాటు చేయాలని, కాల్వ గట్లు పెంచడం, అసంపూర్తి కాల్వలి నిర్మించాలని చివరి ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈఈ రవీందర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఈ వేసవిలో అన్ని కాల్వలకు మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.



# మట్టి.. కొల్లగొట్టి...

నాగర్‌కర్నూల్, తెలకపల్లి అక్రమంగా మట్టి తరలిస్తూ ధనార్జనకు పాల్పడుతున్నా...అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తెలకపల్లి మండలం రామగిరి గుట్ట నుంచి అడ్డూఅదుపు లేకుండా మట్టి తరలించేస్తున్నారు. దుందుభి వాగు పక్కనే ఉన్న ఈ గుట్ట ఖాళీ అవుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, లింగాల ప్రాంతాలకు తీసుకెళ్లి అమేస్తున్నారు. 15 ఎకరాల్లో మట్టి ఖాళీ చేశారు. గతంలో ఓ ప్రైవేటు కంపెనీ ఎకరంలో మట్టి తోడేందుకు అనుమతి పొంది పదెకరాలు కొల్లగొట్టారు.

ప్రైవేటు కన్ను: ఇప్పుడు ప్రైవేటు వ్యాపారుల కన్ను దీనిపై పడింది. ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. 15 రోజుల్లో వందల టిప్పర్ల తరలించారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గుట్ట, తాడూరు మండలంలోని ఇంద్రకల్ దగ్గరలో కొమ్ము గుట్ట నుంచి గుట్టుగా తరలించేస్తున్నారు. ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. తహసీల్దార్ కార్యాలయాలకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



# పీయూలో డిజిటల్ సేవలకు శ్రీకారం

పాలమూరు పాలమూరు విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఏళ్లుగా కొనసాగుతున్న మ్యానువల్ సేవలకు మంగళం పాడనున్నారు. అధునాతన డిజిటల్ సేవలు అందించేందుకు పీయూ అధికారులు చర్యలు చేపడుతున్నారు. తాజా నిర్ణయంతో చాలా సమస్యలకు చెక్ పడనుంది.

వర్సిటీకి రాకుండానే ఆన్‌లైన్ విధానంలో సేవలు పొందేలా మార్పులు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంఈడీ, ఫార్మసీ, ఇంజినీరింగ్, న్యాయ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మేలు జరగనుంది. వారంతా ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి స్టడీ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, ఒరిజినల్ డిగ్రీ పట్టాలు, ట్రాన్స్‌స్క్రిప్ట్ మెమోలు, ఇతర సేవలు పొందొచ్చు. పోస్టు ద్వారా చిరునామాకు తెప్పించుకోవచ్చు. పీయూ పరిధిలో 30 బీఈడీ, 60 డిగ్రీ, రెండు ఎంఈడీ, నాలుగు ఫార్మసీ, ఒక్కో ఇంజినీరింగ్, న్యాయ కళాశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో 35 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇతర దేశాలకు తమ ధ్రువీకరణ పత్రాలు ట్రాన్స్‌స్క్రిప్ట్ విధానంలో పంపించేందుకు అవకాశం కలుగుతుంది. ప్రధానంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రయోజనం ఎక్కువ.

# ఎల్‌సీడీసీ సర్వే

గద్వాల జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి కుష్ఠు వ్యాధిని గుర్తించే ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) నిర్వహించనున్నారు. ఈనెల 31వ తేదీ వరకు ఇది కొనసాగుతుంది. ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని, వ్యాధి లక్షణాలున్న వారికి ఔషధాలను అందిస్తారని అధికారులు తెలియజేస్తున్నారు.

604 బృందాలతో..: ఎల్‌సీడీసీ సర్వే డిసెంబరులో మొదటి విడత, మార్చిలో రెండో విడతగా చేపట్టనున్నారు. జిల్లాలోని మొత్తం 13 మండలాల పరిధిలో చేపట్టనున్న మొదటి విడత సర్వేకు 604 మంది ఆశావర్కర్ల బృందాలను నియమించారు. ఒక్కో కార్యకర్త గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 20 నుంచి 25 వరకు, పట్టణ ప్రాంతాల్లో 25 నుంచి 30 ఇళ్లకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి వారి వివరాలను సేకరించనున్నారు. ఈ బృందాల సర్వే తీరును పరిశీలించి, వారికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు 122 మంది సూపర్‌వైజర్లను నియమించారు. వీరు ఇప్పటికే శిక్షణ పూర్తిచేశారు.

గుర్తింపు.. చికిత్స: 14 రోజుల పాటు ఆశావర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబంలోని ప్రతి ఒక్కరిని పరిశీలించి స్పర్శలేని ఎర్రని రాగి రంగు మచ్చలు, మొద్దుబారిన కాళ్ళు, చేతులు తిమ్మిర్లు లక్షణాలు, నరాల బలహీనత, స్పర్శ కోల్పోవడం వంటి వాటిని పరిశీలిస్తారు. ఈ లక్షణాలున్నట్లయితే వారి పేర్లను నమోదు చేసుకుని సస్పెక్టెడ్ కేసులను వారి పరిధిలోని ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారు. అక్కడ వారికి బహుళ ఔషధాలను ఉచితంగా అందజేస్తారు. వ్యాధి ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుందని, ఇది నెమ్మదిగా పెరిగి లక్షణాలు బహిర్గమతమవుతాయనే అంశాలపైనా అవగాహన కల్పించనున్నారు.

శరీరంపై ఎక్కడైనా మచ్చలు ఉంటే చూపించాలి. రోజూ ఉదయం 6:30 నుంచి 9:30 గంటల వరకు ఆశా కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి కుటుంబంలోని ప్రతి ఒక్కరినీ పరిశీలిస్తారు. ఎవరికైనా లక్షణాలు ఉంటే వారిని అనుమానితకేసులుగా గుర్తించి సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారు. వ్యాధిపై అపోహలు వీడాలి. లక్షణాలను గుర్తించి సకాలంలో చికిత్స తీసుకుంటే నయమవుతుందని గుర్తించాలి.

